సాక్షి ప్రకాశం

సోమవారం । 30 । డిసెంబర్ । 2024



జానపద నృత్యం.. యర్రబాలెం ఆణిముత్యం

కంభం మండలం యర్రబాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు జానపద నృత్యంలో ప్రతిభ చూపుతున్నారు. - 8లో..



ఉసురుతీసిన మద్యం మత్తు

గిద్దలూరు నుంచి బేస్తవారిపేటకు వెళ్తున్న ఓ ద్విచక్ర వాహనదారుడు మద్యం మత్తులో అదుపు తప్పి కారు, మినీట్రక్కును ఢీకొన్నాడు. ఈ ఘటనలో అతడు మృతిచెందాడు. - 8లో..

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 31/21

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలిగాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

కేజీబీవీ ఆకస్మిక తనిఖీ



విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ చేస్తున్న దేవానందరెడ్డి

ముండ్లమూరు(దర్శి): పాఠశాల విద్యాశాఖ సమగ్రశిక్షా కేజీబీవీ కార్యదర్శి డీ దేవానంద రెడ్డి ఆదివారం మండలంలోని కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. 8వ తరగతి విద్యార్థులకు పరీక్ష నిర్వహించి వారి జవాబు పత్రాలను మూల్యాంకనం చేశారు. 10, 11, 12 తరగతుల విద్యార్థులకు 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక స్టడీ అవర్‌ను పర్యవేక్షించారు. స్లిప్‌టెస్ట్ నిర్వహించి విద్యార్థుల అభ్యాస పురోగతిని పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో విద్యార్థి వారీగా వివరణాత్మక పనితీరు సమీక్ష నిర్వహించారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలపట్ల వివరాలు సేకరించారు. వారి అవసరాలను, అభ్యాస వాతావరణాన్ని మెరుగుపరచడానికి అభిప్రాయం సేకరించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయురాలు ఆవుల సునీత, ఉపాధ్యాయురాలు పద్మ, సిబ్బంది ఉన్నారు.

దివ్యాంగుల మోటార్ వాహనాలకు పెట్రోల్ సబ్సిడీ మంజూరు

ఒంగోలు వన్‌టౌన్: ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో ఉన్న అర్హులైన దివ్యాంగుల రెట్రో ఫిట్టింగ్ మూడు చక్రాలున్న మోటారు వాహనాలకు రాష్ట్ర ప్రభుత్వం పెట్రోల్ సబ్సిడీని మంజూరు చేస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జీ అర్చన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఉన్న దివ్యాంగులు ఒంగోలు ప్రకాశం భవన్‌లోని దివ్యాంగుల కార్యాలయంలో దరఖాస్తులు పూర్తి చేసి జనవరి 10వ తేదీ లోపు అందజేయాలని కోరారు. ఇతర పూర్తి వివరాలకు 08592-281310 అనే నంబరులో సంప్రదించాలన్నారు.



బేస్తవారిపేట మండలం సలకలవీడులో పూర్తయినా ప్రారంభానికి నోచుకోని డిజిటల్ లైబ్రరీ, ఆర్బీకే, పాలకేంద్రం భవనాలు

గ్రామ పాలనకు కూటమి గ్రహణం

ప్రభుత్వ పాలనను గ్రామస్థాయికి తీసుకెళ్లడంలో భాగంగా గత ప్రభుత్వంలో ప్రతి ఊరిలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ పేరుతో ప్రభుత్వ కార్యాలయాల భవనాలు నిర్మించారు. మూడొంతుల భవనాలు పూర్తిచేసి ఆయా శాఖలకు అప్పగించారు. మిగిలిన భవనాలు వివిధ దశల్లో ఉండగా..కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వాటిని అటకెక్కించింది. ఇప్పటికే పూర్తయిన భవనాలను వినియోగంలోకి తీసుకురాకపోగా.. అసంపూర్తి భవన నిర్మాణాలను గాలికి వదిలేసింది.

- వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణం
- మొత్తం రూ.423 కోట్లతో 1380 భవనాలు మంజూరు
- జనవరి నాటికి రూ.277.53 కోట్లు విడుదల చేసిన గత ప్రభుత్వం
- 1079 భవనాలు పూర్తి చేసి ఆయా శాఖలకు అప్పగింత
- మిగిలిన భవన నిర్మాణాలు వివిధ దశల్లో..
- కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో నిలిచిపోయిన నిర్మాణాలు
- పూర్తయిన భవనాలనూ వినియోగంలోకి తేని వైనం

ఒంగోలు అర్బన్: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాధించేలా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టి అమలు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పనులను ప్రజలకు చేరువచేసింది. అదేవిధంగా రైతన్నలకు అన్నీ విధాలుగా అండగా నిలుస్తూ వారికి సేవలందించేందుకు రైతు భరోసా కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైఎస్‌ఆర్ హెల్త్ క్లినిక్‌లను తీసుకొచ్చింది. అంతేకాకుండా అవన్నీ శాశ్వత భవనాల్లో ఉండాలని ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలుగా నిర్ణయించి రూ.వందల కోట్లు కేటాయించి సొంత భవనాలు నిర్మించేందుకు శ్రీకారం చుట్టింది. దానిలో భాగంగా జిల్లాలో ప్రాధాన్యత భవనాలు సుమారు 80 శాతం పూర్తి చేసి ఆయా శాఖలకు అప్పగించారు.



రాచర్ల మండలం కాలువపల్లెలో అసంపూర్తిగా ఉన్న ఆర్బీకే

కూటమి ప్రభుత్వంలో నిలిచిన ప్రాధాన్యత భవన నిర్మాణాలు:

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మిగిలిన 20 శాతం భవన నిర్మాణాలు సైతం నిర్లక్ష్యానికి గురయ్యాయి. దీంతో కోట్లాది రూపాయలు వెచ్చించిన భవనాలు శిథిలావస్థకు చేరే పరిస్థితులు నెలకొన్నాయి. కేవలం కూటమి నేతలకు లాభం చేకూరేలా ప్రభుత్వ పనులు, ఉద్యోగాలు, డీలర్‌షిప్‌ల మార్పులు వంటివి చేయడంతో పాటు అధికారం చేపట్టి ఆరు నెలలైనా ఇంకా గత ప్రభుత్వాన్ని విమర్శిస్తూ కాలం వెళ్లదీస్తోంది.

ఇటీవల జరిగిన డీఆర్‌సీ సమావేశంలో కూటమి మంత్రులు, ప్రజాప్రతినిధులు కేవలం రోడ్లపై గుంటలు పూడుస్తాం అని చెప్పారు తప్ప పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులు కొత్తగా చేపడతామని చెప్పకపోవడం గమనార్హం. చివరికి గత ప్రభుత్వంలో పూర్తయిన వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి మిగిలిన కొద్దీ పనులు కూడా మూడేళ్లలో పూర్తి చేస్తామని చెప్పారు. అంతేకాకుండా ప్రతి పనికి గత వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వాన్ని విమర్శించడమే తప్ప కనీసం గ్రామీణ ప్రాంత ప్రజలకు నిత్యం ఉపయోగపడే సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లపై చర్చించకపోవడంతో ప్రజలకు ఏ మేరకు మేలు చేస్తారో అర్థమవుతోంది.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇలా..

భవనాలు	మంజూరైనవి	కేటాయింపు రూ.కోట్లలో	పూర్తయినవి	ఖర్చుచేసింది రూ.కోట్లలో
గ్రామ సచివాలయాలు	531	231.52	422	147.42
రైతు భరోసా కేంద్రాలు	484	115.87	409	80.46
విలేజ్ హెల్త్ క్లినిక్‌లు	365	75.92	248	49.65

2024 జనవరి నాటికి రూ.277.53 కోట్లు విడుదల

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చేపట్టిన ప్రాధాన్యత భవనాలు అధునాతన వసతులతో పూర్తి చేశారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్‌ఆర్ హెల్త్ క్లినిక్ భవనాలకు సంబంధించి మొత్తం 1380 భవనాలు మంజూరయ్యాయి. వీటిలో వివిధ దశల్లో 304 భవన నిర్మాణాలు మినహా మొత్త భవనాలు పూర్తి చేసి ఆయా శాఖలకు అప్పగించారు. మొదట్లో సాంకేతిక కారణాలతో బిల్లుల విడుదల కొంత ఆలస్యం అయినా, ప్రారంభించినప్పటి నుంచి 2024 జనవరి నాటికి మొత్తం రూ.277.53 కోట్లు విడుదల చేసింది.

రూ.423.31 కోట్లతో 1380 ప్రాధాన్యత భవనాలు:

జిల్లాలో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు కలిపి మొత్తం 1380 భవనాలు మంజూరు కాగా వాటికి రూ.423.31 కోట్లు కేటాయించింది నాటి వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వం. వాటిలో రూ.277.53 కోట్లు విడుదల చేసి 1079 భవనాలు పూర్తి చేసింది. పూర్తయిన వాటిలో గ్రామ సచివాలయాలకు సంబంధించి రూ.231.52 కోట్లతో 531 భవనాలు మంజూరు కాగా వాటిలో రూ.147.42 కోట్లతో 422 భవనాలు పూర్తి చేశారు. రైతుభరోసా కేంద్రాలకు సంబంధించి రూ.115.87 కోట్లతో 484 భవనాలు మంజూరైతే వాటిలో రూ.80.46 కోట్లతో 409 భవనాలు పూర్తి చేశారు. అదేవిధంగా విలేజ్ హెల్త్ క్లినిక్‌లు రూ.75.92 కోట్లతో 365 భవనాలు మంజూరు కాగా వాటిలో రూ.49.65 కోట్లతో 248 భవనాలు పూర్తి చేశారు. పూర్తయిన ప్రాధాన్యత భవనాలు ఆయా శాఖలకు సైతం అప్పగించారు. వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న 109 గ్రామ సచివాలయాలు, 75 రైతు భరోసా కేంద్రాలు, 117 విలేజ్ క్లినిక్‌లను కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ఆ భవనాల నిర్మాణాలు పూర్తి చేసేందుకు సంబంధిత శాఖలకు ఆదేశించాలని ప్రజలు కోరుతున్నారు.

నిర్మాణ పనులు పూర్తి చేస్తే డబ్బులు చెల్లిస్తాం

గతంలో మంజూరైన భవన నిర్మాణ పనులకు సంబంధించి ప్రస్తుతం పూర్తి చేసిన వెంటనే డబ్బులు చెల్లిస్తాం. కానీ ఆర్బీకే, సచివాలయ భవనాల నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. నిధుల చెల్లింపులో ఎటువంటి ఇబ్బందులు లేవు.

– కోటేశ్వరరావు, పంచాయతీరాజ్ ఈఈ, ఒంగోలు

వివిధ దశల్లో నిర్మాణాల్లో నిలిచిపోయినవి

గ్రామ సచివాలయాలు: 109

రైతు భరోసా కేంద్రాలు: 75

విలేజ్ క్లినిక్‌లు: 117



అర్థవీడు మండలంలో అసంపూర్తిగా ఉన్న ఆర్బీకే భవనం

పోలీసు ఉద్యోగం కొట్టేదెవరో..

- నేటి నుంచి పోలీసు ఉద్యోగాలకు దేహదారుఢ్య పరీక్షలు
- జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో సర్వం సిద్ధం
- విజయవంతంగా ట్రయల్ రన్
- ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ప్రిలిమినరీ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు నేటి నుంచి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో సోమవారం నుంచి జనవరి 10వ తేదీ వరకు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకు గాను జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలోని పరేడ్ గ్రౌండ్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం ట్రయల్ రన్ నిర్వహించారు. మైదానంలోకి ప్రవేశించడానికి కేవలం అభ్యర్థులను మాత్రమే అనుమతించనున్నారు. మైదానం ప్రవేశ ద్వారం నుంచి మొదలుకొని ధ్రువపత్రాల పరిశీలన, ధ్రువపత్రాల కంప్యూటీకరణ, దేహదారుఢ్య పరీక్షలు పూర్తి చేసుకొని తిరిగి వెళ్లే వరకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. లోపలకు ప్రవేశించిన తరువాత అభ్యర్థులకు పరీక్ష ఘట్టాలకు సంబంధించిన సమాచారాన్ని వివరిస్తూ సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రతి ఈవెంట్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి గట్టి నిఘా ఉంచారు. అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారిని పర్యవేక్షణకు నియమించారు. అభ్యర్థుల కోసం మంచినీరుతోపాటుగా వైద్య శిబిరాన్ని సిద్ధంగా ఉంచారు. ఈ దేహదారుఢ్య పరీక్షలకు 4435 మంది పురుషులు, 910 మంది మహిళా అభ్యర్థులతో కలుపుకొని మొత్తం 5345 మంది హాజరుకానున్నారు. ఇప్పటికే వీరికి అడ్మిట్ కార్డులను పంపించారు. అడ్మిట్ కార్డులు ఉన్న వారిని మాత్రమే మైదానంలోకి అనుమతిస్తారు. రోజుకు 600 మంది పరీక్షలకు హాజరవుతారని అంచనా వేస్తున్నారు.



పోలీసు దేహదారుఢ్య పరీక్షల ట్రయల్ రన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు

పోలీసు ఉద్యోగాలకు సంబంధించి 12 రోజుల పాటు నిర్వహించనున్న దేహదారుఢ్య పరీక్షల కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. సీసీ కెమెరాల నిఘాలో అత్యంత పారదర్శకంగా ఈ పరీక్షలను నిర్వహిస్తారని, ఎలాంటి అవాంతరాలు, అసౌకర్యానికి తావు లేకుండా అన్నీ రకాల ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ప్రతిభ ఉన్న వారికే ఉద్యోగాలు వస్తాయని, మధ్య దళారుల మాటలు మోసపోవద్దని స్పష్టం చేశారు. రిక్రూట్‌మెంట్ బోర్డు కేటాయించిన తేదీల్లో అభ్యర్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు తమ వెంట అడ్మిట్ కార్డు, సంబంధిత సర్టిఫికెట్లు తీసుకొని రావాలని సూచించారు. 1600 మీటర్లు పరుగు పందెం, 100 మీటర్ల లాంగ్ జంప్ పరీక్షలకు అన్నీ రకాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈవెంట్స్‌కు సంబంధించిన ట్రయల్ రన్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ ట్రయల్ రన్‌లో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, డీపీవో ఏఓ రామ్మోహన రావు, ఐటీకోర్ సీఐ సూర్యనారాయణ, ఆర్ఐలు రమేష్ కృష్ణన్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

- విద్యార్థి యువజన సంఘాల డిమాండ్

ఒంగోలు టౌన్: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారని, వెంటనే బకాయిలు చెల్లించాలని వైఎస్సార్ ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రామాంజి యాదవ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ డిమాండ్ చేశారు. నగరంలోని మల్లయ్యలింగం భవనంలో ఆదివారం విద్యార్థుల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా విద్యాదీవెన, వసతిదీవెనల పేర్లు మార్చడమే కానీ కనీసం ఒక్క రూపాయి బకాయిలు కూడా చెల్లించలేదని విమర్శించారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే 7 లక్షల విద్యార్థుల సర్టిఫికెట్లు విద్యా సంస్థల యాజమాన్యాల వద్ద ఉన్నాయని, యాజమాన్యాల వద్ద సర్టిఫికెట్లు ఉండడం వల్ల ఎవరికి ప్రయోజనం ఉంటుందో పాలకులు చెప్పాలని నిలదీశారు. సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో దాదాపుగా 10 లక్షల మంది విద్యార్థులు ఉన్నత విద్యావకాశాలను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నంబర్ 77ను రద్దు చేయాలని గత రెండు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వానికి వినతి పత్రాలు అందజేస్తున్నా, ఆందోళనలు చేపట్టినా దున్నపోతు మీద వర్షం కురిసినట్లు ఉందన్నారు. సోమవారం విజయవాడ ధర్నా చౌకలో జరిగే పోరుకు విద్యార్థి లోకం మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ ఎస్‌యూ నాయకులు

న్యూ ఇయర్ క్యాలెండర్ ఆవిష్కరణ

ఒంగోలు సిటీ: ఒంగోలులోని పీవీఆర్ హైస్కూల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏపీ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన క్యాలెండర్‌ను గుంటూరు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ ఆర్జేడీ వి.వి.సుబ్బారావు ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకి ఐడెంటిటీ కార్డులు పంపిణీ చేశారు. అసోసియేషన్ సభ్యులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తారక్‌నాథ్, యూనియన్ అధ్యక్షుడు సీహెచ్.శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ సురేష్ బాబు, జనరల్ సెక్రటరీ అబ్దుల్ హయత్, కోశాధికారి సాయి కిషోర్, పబ్లిసిటీ సెక్రటరీ పి.అనీల్ పురుషోత్తమ్, మహిళా రిప్రజెంటేటివ్ ఐ.వి.సుజాత, అసోసియేట్ ప్రెసిడెంట్ మధుసూదనరావు, జాయింట్ సెక్రటరీలు ఎస్.వాణి, కె.రామకృష్ణారెడ్డి, రాజు సురేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వై.రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



ఏపీ స్టేట్ ఇంటర్మీడియెట్ నాన్ టీచింగ్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరించిన ఆర్జేడీ వి.వి.సుబ్బారావు



సెంచరీ చేసిన ఆనందంలో నితీష్ రెడ్డి

పరుగుల వీరుడు మనోడే

- యువ క్రికెటర్ నితీష్‌కుమార్‌రెడ్డితో జిల్లాకు అనుబంధం
- అతని తల్లి స్వగ్రామం జిల్లాలోని చెరువుకొమ్ముపాలెం
- ఒంగోలులోను రంజీ మ్యాచ్‌లు ఆడిన నితీష్‌రెడ్డి
- బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ టెస్ట్ మ్యాచ్‌లో అద్భుత సెంచరీతో మెరిసిన యువతేజం

ఒంగోలు: కాకి నితీష్‌కుమార్‌రెడ్డి...నేడు ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్ ప్రేమికుల్లో ఎనలేని క్రేజ్ నింపేశాడు. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ వేదికగా జరుగుతున్న బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ టెస్ట్ మ్యాచ్‌లో అతను ఆడిన అద్భుత ఇన్నింగ్స్ భారత క్రికెట్ ప్రేమికులకు చిరకాలం గుర్తుండిపోతుంది. ఈ యువ ఆటగాడి స్వస్థలం విశాఖ అయినా అతని తల్లి స్వగ్రామం ప్రకాశం జిల్లా ఒంగోలు నగర శివారులోని చెరువుకొమ్ముపాలెం కావడంతో అతనికి జిల్లాతో ఎంతో అనుబంధం ఉంది.

చిన్నతనం నుంచి క్రికెట్ అంటేనే క్రేజ్:

అందరు చదువుతూ ఆడతామంటారు. కానీ నితీష్‌రెడ్డి మాత్రం ఆడుతూ చదువుకుందామంటారు. చిన్నతనం నుంచి క్రికెట్ అంటే ఎంతో మక్కువ ఉన్న నితీష్ కఠోర సాధనతో రైట్ హ్యాండ్ బ్యాట్స్‌మన్‌గానే కాకుండా మీడియం పేసర్‌గా కూడా రాణిస్తూ నేడు అంతర్జాతీయ క్రికెట్‌కు మరో అద్భుత వరంగా మారాడు.

ఒంగోలుతో అనుబంధం ఇలా..

చెరువుకొమ్ముపాలేనికి చెందిన పూసపాటి నరశింహారెడ్డి, సుశీలకు ఇద్దరు సంతానం. ఒకరు మానస (నితీష్ రెడ్డి తల్లి). మరొకరు సురేంద్ర రెడ్డి (ప్రస్తుతం ఆస్ట్రేలియాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం). మానస, ముత్యాలరెడ్డిలకు ఇద్దరు సంతానం. పెద్ద కుమార్తె తేజస్వి ఆస్ట్రేలియాలో మెడిసిన్ చేస్తున్నారు. ఇక రెండో సంతానమే నితీష్‌రెడ్డి. ఒక వైపు విద్యను అభ్యసిస్తూనే మరో వైపు క్రికెట్‌లో దూసుకెళుతున్నాడు. ఐదో ఏటనే ప్లాస్టిక్ బ్యాట్‌తో క్రికెట్ ఆటలో అరంగేట్రం చేసిన నితీష్ రెడ్డి అంచెలంచెలుగా ఎదిగి నేడు అంతర్జాతీయ స్థాయికి చేరుకున్నాడు. 2017-18లో విజయ్ మర్చంట్ ట్రోఫీలో నాగాలాండ్ జట్టుపై 441 బంతుల్లో 345 పరుగులు చేసి క్రికెట్ అభిమానుల మనస్సును దోచుకున్నాడు. దీంతో ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున అవకాశాన్ని కైవసం చేసుకున్నాడు. పంజాబ్‌పై అద్భుతంగా 64 పరుగులు (ఒకే ఒక్క పరుగుతో గెలుపు), రాజస్థాన్‌పై 76 పరుగులు చేసి సన్‌రైజర్స్ జట్టు గెలుపులో తనదైన ముద్ర వేసుకున్నాడు. ఒంగోలులోని శర్మా కాలేజీ గ్రౌండులో సైతం 2018, 2019లో రంజీ మ్యాచ్‌లు ఆడాడు. ఇటీవల అమ్మమ్మ సుశీల పరమపదించడంతో అంత్యక్రియల్లో పాల్గొనేందుకు నితీష్‌రెడ్డి చెరువుకొమ్ముపాలేనికి వచ్చారని గ్రామస్తులు తెలిపారు.



చెరువుకొమ్ముపాలెంలోని అమ్మమ్మ, తాతయ్యల నివాసం



స్నేహితుడు ఆల నారాయణతో నితీష్ రెడ్డి

సంతోషంగా ఉంది



నితీష్‌రెడ్డికి చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటేనే ప్రేమ. అనేక మార్లు గ్రామానికి తల్లితో పాటు వచ్చి వెళుతుండేవాడు. విద్యాభ్యాసం ఇక్కడ చేయకున్నా ఇక్కడ ఉన్న కుర్రాళ్లతో మాత్రం పరిచయాలు మెండుగానే ఉన్నాయి. ఇన్నాళ్లకు అంతర్జాతీయంగా క్రికెట్‌లో రాణించాడని తెలియడంతో గ్రామంలో చాలామంది నా మనవడి గురించి గొప్పగా మాట్లాడుతుంటే చెందే అనుభూతిని వర్ణించలేం. ఇంకా ఉన్నత స్థాయికి చేరాలనేదే మా ఆకాంక్ష.

– పూసపాటి నరశింహారెడ్డి, నితీష్‌రెడ్డి తాతయ్య

స్నేహితుడిగా ఆనందంగా ఉంది



నాది చెరువుకొమ్ముపాలెమే. నితీష్‌రెడ్డి మేనమామ సురేంద్రరెడ్డి నాకు క్లాస్‌మేట్. దీంతో అమ్మమ్మ గారింటికి వచ్చినప్పుడల్లా నాకు నితీష్‌రెడ్డితో పరిచయం ఉండేది. మాతో ఎక్కువగా క్రికెట్ ప్రాక్టీస్ గురించే మాట్లాడేవాడు. ఒంగోలులో రంజీ మ్యాచ్‌లు ఆడేందుకు వచ్చిన సమయంలోను నాతో మాట్లాడాడు. స్నేహితులను గుర్తుపెట్టుకుని పలకరిస్తాడు. చాలామంది యువ క్రికెటర్లలో ఎనలేని క్రేజ్‌ను నితీష్ రెడ్డి సంపాదించుకోవడం ఆనందంగా ఉంది. వచ్చే ఏడాది జూన్‌లో మళ్లీ చెరువుకొమ్ముపాలేనికి నితీష్‌రెడ్డి వస్తారని సమాచారం. ఆ రోజు గ్రామంలో ఘనంగా సత్కారం చేయాలని భావిస్తున్నాం.

– ఆల నారాయణ, నితీష్‌రెడ్డి చిన్ననాటి స్నేహితుడు

క్లుప్తంగా

జర్నలిస్టులకు వెంటనే అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలి


మాట్లాడుతున్న ఐవీ సుబ్బారావు

మార్కాపురం: జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు వెంటనే మంజూరు చేయాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు డిమాండ్ చేశారు. ఆదివారం మార్కాపురం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టుల సంక్షేమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా శ్రద్ధ వహించి ప్రతి ఒక్కరికీ అక్రిడేషన్ కార్డులు అందేవిధంగా చూడాలని కోరారు. సమాచార శాఖ అధికారులు సానుకూలంగా స్పందించి జనవరి 1న కొత్త అక్రిడేషన్లు ఇవ్వడమా, పాత వాటిని రెన్యువల్ చేయడమా అనేది త్వరగా నిర్ణయం తీసుకోవాలన్నారు. జనవరి 15లోపు అక్రిడేషన్ల ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. చనిపోయిన జర్నలిస్టుల జీవిత భాగస్వామికి ఇస్తున్న పెన్షన్‌ను రూ.10 వేలకు పెంచాలని, వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటుచేసి నిధులు కేటాయించాలని కోరారు. అమరావతి, సెక్రటేరియట్, సీఎం ఆఫీసులో జర్నలిస్టులకు సమాచారం సరిగ్గా రావడం లేదని, పీఆర్‌ఓలను నియమించాలని కోరారు. ప్రెస్‌మీట్‌లో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ రమణ, ఉపాధ్యక్షుడు బాజీవలి, మార్కాపురం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి గుంతలో పడి వ్యక్తి మృతి

వేటపాలెం: ప్రమాదవశాత్తూ నీటి గుంతలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. వేటపాలెం మండలంలోని పాపాయిపాలెం గ్రామ శివారు పొలాల్లో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పీ వెంకటేశ్వర్లు (58) తమ పశువులను ప్రతిరోజూ పొలానికి తోలుకెళ్లి మేపుకొస్తుంటాడు. అదే మాదిరిగా ఆదివారం కూడా పొలానికి పశువులను తోలుకెళ్లాడు. పొలంలోని నీటి గుంతలో దిగాడు. గుంతలో నుంచి రెండు రోజుల కిందటే ఇసుక మాఫియా ఇసుక తరలించడంతో గుంత లోతుగా ఉంది. గమనించని వెంకటేశ్వర్లు నీటిలో మునిగి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈపురుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

జానపద నృత్యం..
యర్రబాలెం ఆణిముత్యం..!

పట్టుదలతో శ్రమిస్తే సాధించలేనిది ఏదీలేదని నిరూపిస్తున్నారు కంభం మండలంలోని యర్రబాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు. జానపద నృత్యంలో సత్తాచాటుతూ జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొంది బహుమతులు కైవసం చేసుకున్నారు. ఏకంగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై వచ్చే ఏడాది జనవరిలో భోపాల్‌లో నిర్వహించనున్న జాతీయ కళా ఉత్సవ్ పోటీలకు ఎంపికయ్యారు.

- జానపద నృత్యంలో సత్తా చాటుతున్న యర్రబాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు
- జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచి బహుమతులు
- వచ్చే ఏడాది జనవరిలో భోపాల్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక
- ప్రత్యేక శిక్షణ ఇస్తున్న సంగీత ఉపాధ్యాయుడు ఖాసిం

కంభం:

మండలంలోని యర్రబాలెం జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థినులు పిక్కిలి పావని, పిక్కిలి లక్ష్మి, నల్లబోతుల మాధవి, నల్లబోతుల కామేశ్వరి, ఈర్ల శివపార్వతి రెండేళ్లుగా జానపద నృత్యంలో ప్రతిభ చూపుతున్నారు. క్షేత్రస్థాయి నుంచి అంచలంచెలుగా ఎదుగుతూ పోటీల్లో రాణిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచి ప్రస్తుతం జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై అందరి అభినందనలు అందుకుంటున్నారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ విజేతలుగా నిలిచేందుకు సంగీత ఉపాధ్యాయుడు ఖాసిం ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నారు.

ప్రత్యేక శిక్షణ ఇస్తున్న ఖాసిం...

రెండు సంవత్సరాల క్రితం యర్రబాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంగీత ఉపాధ్యాయుడిగా ఎం.ఖాసిం బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి సంగీతంపై, జానపద నృత్యాలపై ఆసక్తి ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి సానపెట్టే పనిలో నిమగ్నమయ్యారు. అలాగని, విద్యార్థుల చదువులకు ఇబ్బంది కలగకుండా సంగీతం పీరియడ్‌తో పాటు తరగతులు అయిపోయిన తర్వాత, ఆదివారాలు, ఇతర సెలవు దినాల్లో ప్రత్యేకంగా శిక్షణ ఇస్తూ వస్తున్నారు. ఆయన సొంత ఖర్చులతో విద్యార్థులకు శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు. పాఠశాలలో చదువుతున్న పిక్కిలి పావని, పిక్కిలి లక్ష్మి, నల్లబోతుల మాధవి, నల్లబోతుల కామేశ్వరి, ఈర్ల శివపార్వతిలకు జానపద నృత్యంలో ప్రావీణ్యం ఉన్నట్లు గుర్తించి వారిని డివిజన్ స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచే విధంగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపికవగా, అక్కడ కూడా విజయం సాధించేలా వారిని ఖాసిం తీర్చిదిద్దుతున్నారు.


రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రదర్శన ఇస్తున్న యర్రబాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు

సంగీత దర్శకుడిగానూ రాణిస్తున్న ఖాసిం...

జానపద నృత్యంలో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఖాసిం.. సంగీత ఉపాధ్యాయుడిగానూ రాణిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు జానపద నృత్యంతో పాటు సంగీతం కూడా నేర్పిస్తున్నారు. మరో వైపు సినిమా రంగం, షార్ట్ ఫిల్మ్, ప్రైవేట్ ఆల్బమ్స్, రాజకీయ పాటలు, నాటికలు, భక్తి పాటలు చేస్తూ సంగీతంలో ప్రతిభ చాటుతున్నాడు. కీబోర్డ్, నాదస్వరం, పియానో, ఫ్లూట్, వయోలిన్ వాయించడంలో దిట్టగా పేరుపొందాడు. 200కుపైగా ఆల్బమ్స్, 70కిపైగా సినిమాలకు నేపథ్య సంగీతం అందించారు. రెండు సార్లు నంది అవార్డులతో పాటు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాల నుంచి పలు అవార్డులు అందుకున్నారు. ఐదు సార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటారు.

ఖాసిం సార్ ఇచ్చిన శిక్షణతోనే రాణిస్తున్నా



సంగీతం ఉపాధ్యాయుడు ఖాసిం సార్ ఇచ్చిన శిక్షణ వలనే ఈ స్థాయికి చేరుకున్నాము. జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు సిద్ధమవుతున్నాము. అక్కడ కూడా మంచి ప్రదర్శన ఇచ్చి మా పాఠశాల పేరును, మా గ్రామం పేరును దేశవ్యాప్తంగా తెలియజేస్తాం.

– పిక్కిలి పావని, పదో తరగతి విద్యార్థిని

జాతీయస్థాయి పోటీలకు బాగా సిద్ధమవుతున్నాం



పాఠశాల సమయం ముగిసిన తర్వాత, సెలవు రోజుల్లో మా సంగీతం ఉపాధ్యాయుడు ఖాసిం సార్ మాకు జానపద నృత్యాలపై శిక్షణ ఇస్తున్నారు. ఉపాధ్యాయులు కూడా మాకు సహకరిస్తున్నారు. జాతీయ స్థాయిలో సత్తాచాటుతామన్న నమ్మకం ఉంది.

– నల్లబోతుల కామేశ్వరి

అందరి సహకారంతోనే సాధ్యం



విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు నా వంతు కృషి చేస్తున్నాను. గత రెండు సంవత్సరాల్లో విద్యార్థులు ఆరు సార్లు జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని సత్తాచాటారు. ఈసారి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవడం గర్వంగా ఉంది. అక్కడ కూడా సత్తా చాటాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాను. ప్రధానోపాధ్యాయుడు ఏరువ లక్ష్మయ్య, ఉపాధ్యాయులందరి సహకారంతోనే విద్యార్థులు రాణిస్తున్నారు. భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించేలా వారిని తీర్చిదిద్దాలన్నదే నా లక్ష్యం.

– ఎం.ఖాసిం, సంగీత ఉపాధ్యాయుడు, యర్రబాలెం జెడ్పీ హైస్కూల్

పాఠశాల విద్యార్థినులు సాధించిన విజయాలు...

2023వ సంవత్సరంలో...

- సెప్టెంబరు నెలలో మార్కాపురంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచారు.
- అక్టోబర్‌లో మైనంపాడు డైట్ కాలేజీలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించారు.
- నవంబర్‌లో విజయవాడలో జరిగిన పోటీల్లో రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో నిలిచారు.



2024వ సంవత్సరంలో...

- అక్టోబర్‌లో నేషనల్ డ్యాన్స్ అకాడమీ వారు నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానం సాధించారు.
- నవంబర్‌లో ప్రపంచ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరులో జరిగిన పోటీల్లో రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచారు.
- నవంబర్‌లో మైనంపాడులో జరిగిన కళా ఉత్సవ్ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించారు.
- డిసెంబర్ నెలలో విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలవడంతో పాటు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.
- వచ్చే ఏడాది జనవరిలో 2, 3, 4 తేదీల్లో భోపాల్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున పాల్గొననున్నారు.



సంగీత ఉపాధ్యాయుడు ఖాసింను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు


రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులతో కలిసి జ్ఞాపిక అందుకుంటున్న సంగీత ఉపాధ్యాయుడు ఖాసిం

ఉసురు తీసిన మద్యం మత్తు


మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి


దెబ్బతిన్న స్కార్పియో వాహనం

- కారు, మినీట్రక్కును ఢీకొని మోటార్ సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తి మృతి
- అదుపుతప్పి ఢీకొట్టుకున్న కారు, మినీట్రక్కు
- కారులో ప్రయాణిస్తున్న వారికి కూడా గాయాలు

బేస్తవారిపేట: మద్యం మత్తు ఓ ద్విచక్ర వాహనదారుడి ప్రాణం తీసింది. అంతేగాకుండా ఆ ద్విచక్ర వాహనదారుడు మద్యం మత్తులో కారు, మినీట్రక్కును కూడా ఢీకొట్టడంతో అవి రెండూ అదుపుతప్పి ఢీకొన్నాయి. కారులో ప్రయాణిస్తున్న వారికి కూడా గాయాలయ్యాయి. బేస్తవారిపేట మండలంలో ఆదివారం జరిగిన ఈ సంఘటన వివరాల్లోకెళ్తే.. గిద్దలూరు వైపు నుంచి బేస్తవారిపేటకు మోటార్ సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తి పూటుగా మద్యం సేవించి రోడ్డుపై అడ్డదిడ్డంగా వాహనం నడుపుతున్నాడు. అతన్ని గమనించిన మరో వాహనదారుడు పందిళ్లపల్లె టోల్‌ప్లాజా నిర్వాహకులకు సమాచారం తెలియజేశాడు. దీంతో పూటుగా మద్యం సేవించిన మోటార్ సైక్లిస్టును కొద్దిసేపు అక్కడే నిలిపేందుకు టోల్ ప్లాజా సిబ్బంది ప్రయత్నించారు. వారితో అతను గుర్తుతెలియని భాషలో మాట్లాడుతూ వేగంగా వెళ్లిపోయాడు. టోల్‌గేట్ దాటి కొద్ది దూరం వెళ్లిన తర్వాత అరటికాయల లోడుతో వెళ్తున్న బొలేరో మినీ ట్రక్కును ఓవర్‌టేక్ చేస్తూ ఎదురుగా వచ్చిన స్కార్పియో కారును ఢీకొట్టాడు. వెంటనే బొలేరో ట్రక్కును కూడా ఢీకొట్టాడు. బొలేరో అదుపుతప్పి స్కార్పియో కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కార్పియోలో ప్రయాణిస్తున్న నంద్యాల జిల్లాకు చెందిన జింకల నారాయణ, పిక్కిలి పద్మ తలకు గాయాలయ్యాయి. నారాయణ భార్య లక్ష్మణుడికు కూడా స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను బేస్తవారిపేటలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. మోటార్ సైకిల్ రోడ్డుపై పల్టీలు కొట్టుకుంటూ పక్కన పడిపోయింది. మద్యం మత్తులో దానిపై ప్రయాణిస్తున్న గుర్తుతెలియని వ్యక్తి అక్కడికక్కడే మృత్యువాతపడ్డాడు. ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మోటార్ సైకిల్ (పల్సర్) కడప ప్రాంతంలోని వ్యక్తి పేరుతో రిజిస్ట్రేషన్ అయి ఉందని, మృతుడి వివరాలు తెలిస్తే సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

శ్రీశైలం ఘాట్ రోడ్డులో ప్రమాదం

- అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లిన కారు

పెద్దదోర్నాల: కారు అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లిన సంఘటన శ్రీశైలం ఘాట్‌రోడ్డులో పెద్దదోర్నాల మండలంలోని చింతల గిరిజనగూడెం సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలైనట్లు సమాచారం. ప్రమాదానికి సంబంధించి అందిన సమాచారం మేరకు.. ఒంగోలు నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి దైవదర్శనానికి వెళ్తున్న వారి కారు చింతల గిరిజనగూడెం సమీపంలో ఎదురుగా ఉన్న చిన్నపాటి గుంతను తప్పించే క్రమంలో అదుపుతప్పింది. రోడ్డు పక్కన రెయిలింగ్‌ను ఢీకొట్టి లోయలోకి దూసుకెళ్లడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై మహేష్ సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయనున్నట్లు ఆయన తెలిపారు.


లోయలోకి దూసుకెళ్లిన కారు

హత్య కేసు ఛేదించిన పోలీసులకు రివార్డులు

యర్రగొండపాలెం: హత్య కేసు ఛేదించిన యర్రగొండపాలెం పోలీసులకు ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదివారం రివార్డులు అందజేశారు. యర్రగొండపాలెం మండలంలోని గుర్రపుశాలలో పిన్నమ్మను హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు ఓ వ్యక్తి ప్రయత్నం చేశాడు. ఈ కేసును సీఐ సీహెచ్ ప్రభాకరరావు, ఎస్సై పి.చౌడయ్య ఆధ్వర్యంలో కానిస్టేబుళ్లు పి.బాషావలి, జి.అనిల్‌కుమార్ విచారణ చేపట్టి శీతల పానీయంలో సైనైడ్ కలిపి హత్య చేసినట్లు నిర్ధారించారు. కేసును త్వరితగతిన ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసిన వారికి ఎస్పీ రివార్డులు అందజేశారు.


రివార్డులు అందుకుంటున్న సీఐ ప్రభాకరరావు, ఎస్సై చౌడయ్య

ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై కారు బీభత్సం

ఒంగోలు టౌన్: నగరంలోని పాత జాతీయ రహదారిపై ఉన్న ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ఓ కారు అదుపుతప్పి బీభత్సం సృష్టించింది. ఆదివారం ఉదయం పెళ్లూరు సమీపంలో జరిగిన కారు ప్రమాదంలో ఒక మహిళ ప్రాణాలు కోల్పోయిన సంఘటన మరవకముందే.. సాయంత్రం ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై జరిగిన కారు ప్రమాదం నగరవాసులకు ఆందోళన కలిగించింది. అయితే, ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని మంగమూరు రోడ్డు నుంచి ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా త్రోవగుంట వైపు వెళ్తున్న ఒక కారు తాలూకా పోలీసు స్టేషన్ సమీపంలోకి రాగానే అదుపుతప్పి పక్కనున్న డివైడర్‌ను ఢీకొట్టింది. ఆ సమయంలో కారులో ఐదుగురు ప్రయాణికులు ఉన్నారు. ఒక మహిళా ప్రయాణికురాలు కూడా ఉన్నారు. అయితే, ఎవరికీ పెద్దగా గాయాలు కాలేదు. అందరూ క్షేమంగా బయటపడ్డారు. కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. ఈ ప్రమాదం జరిగినప్పుడు రోడ్డుపై పాదచారులుగానీ, వాహనాలుగానీ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. వెంటనే తాలూకా పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.


ప్రమాదానికి గురైన కారు

డివైడర్‌ను ఢీకొని ఆటోపై పడిన కారు

- ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ మృతి
- మరో ఆరుగురికి గాయాలు

ఒంగోలు టౌన్: వేగంగా వస్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి ఎగిరిపడింది. పక్కనే వెళ్తున్న ఆటోపై పడటంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఒక మహిళ మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. టంగుటూరు మండలం వెంకటాయపాలెం గ్రామానికి చెందిన లక్కే పద్మ (40) కుటుంబ సభ్యులతో కలిసి బొంతలు కుట్టుకుని జీవనం సాగిస్తోంది. ఎప్పటిలాగే బొంతలు కుట్టేందుకు ఆదివారం కూతుర్లు లక్ష్మి, మాధవితో కలిసి ఆటోలో ఒంగోలు బయలు దేరింది. వీరితోపాటుగా టంగుటూరుకు చెందిన రమేష్, విజయమ్మ, బాలకోటేశ్వరరావు, చీమకుర్తికి చెందిన సెక్యూరిటీ గార్డుగా పనిచేసే మున్వర్ ఆటోలో ప్రయాణిస్తున్నారు. ఇంకొద్దిసేపట్లో ఒంగోలు చేరుకుంటామనగా జాతీయ రహదారిపై పెళ్లూరు ఫ్లై ఓవర్ వద్దకు రాగానే నెల్లూరు నుంచి విజయవాడ వెళుతున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. గాల్లోకి ఎగిరి పక్కన వెళుతున్న ఆటోపై పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న లక్కే పద్మ అక్కడికక్కడే మృతి చెందగా, ఆరుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని వెంటనే స్థానిక జీజీహెచ్‌కి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే కారు డ్రైవర్‌తో సహా అందులో ప్రయాణిస్తున్న వారంతా పరారయ్యారు. ఒంగోలు తాలూకా పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ షేక్ ఫిరోజ్ ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పద్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు.


రోడ్డు ప్రమాదంలో ధ్వంసమైన కారు, ఆటో

తొలగించిన ఆరోగ్య కార్యకర్తలను విధుల్లోకి తీసుకోవాలి

- రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

ఒంగోలు టౌన్: తొలగించిన పురుష ఆరోగ్య కార్యకర్తలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులను తక్షణమే అమలు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. నగరంలోని నందూరి ప్రసాదరావు భవనంలో ఆదివారం మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ నాయకుడు వై.సురేష్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎన్‌జీవో అధ్యక్షుడు కె.శరత్ బాబు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల కడుపులు కొట్టడం సరైన నిర్ణయం కాదని, ఉద్యోగులు చేసే పోరాటాలకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఏపీ హెల్త్ అసిస్టెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు టి.రమణారెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలుగా 22 ఏళ్లపాటు సుదీర్ఘకాలం పనిచేసిన ఉద్యోగులను ఉన్నపళంగా ఉద్యోగాల నుంచి తొలగించడం అన్యాయమన్నారు. కరోనా, డెంగీ, అతిసారా వంటి అంటు వ్యాధులను అరికట్టడంలో అంకితభావంతో పనిచేసిన ఉద్యోగులకు ఇచ్చే బహుమతి ఇదేనా అని ప్రశ్నించారు. తొలగించిన ఉద్యోగుల కుటుంబాల రోదనను అర్థం చేసుకోవాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ.. వయసులో ఉన్నంత కాలం పనులు చేయించుకొని వయసు మళ్లిన తరువాత వారిని విధుల నుంచి తొలగించడం అన్యాయం అన్నారు.

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించాలని యూనియన్ రాష్ట్ర నాయకుడు తాళ్లూరి వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వివిధ యూనియన్లకు చెందిన నాయకులు శ్రీధర్ బాబు, కె.వెంకటేశ్వర్లు, టి.రవి, జి.శ్రీనివాసులు, మసూద్ అలి, ఇ.అన్నపూర్ణ, డి.మల్లికార్జునరావు, టి.తిరుపతిరావు, మాలకొండయ్య, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎన్జీఓ అధ్యక్షుడు శరత్ బాబు

తల్లిదండ్రుల మరణాన్ని జీర్ణించుకోలేక..

- ఉరేసుకుని కుమారుడు ఆత్మహత్య

కనిగిరి రూరల్ (హనుమంతునిపాడు): ఏడాదిలోపే తల్లితండ్రుల మరణాన్ని జీర్ణించుకోలేక ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శనివారం రాత్రి కనిగిరిలోని పరాశర భారతీ స్కూల్ బజార్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వెలిగండ్ల మండలం గుడిపాటిపల్లి పంచాయతీ లక్ష్మక్కపల్లి గ్రామానికి చెందిన దేవిరెడ్డి నారాయణరెడ్డి భార్యాబిడ్డలతో కొన్నేళ్ల నుంచి కనిగిరి పట్టణం కొత్తపేటలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. నారాయణరెడ్డి భార్య తిరుపతమ్మ గతేడాది అనారోగ్యంతో మృతి చెందింది. నారాయణరెడ్డి కూడా గతవారంలో అనారోగ్యంతో మృతి చెందగా, గత శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. తల్లిదండ్రులిద్దరూ మరణించడంతో ఒంటరితనాన్ని జీర్ణించుకోలేక మనోధైర్యం కోల్పోయి వారి కుమారుడు దేవిరెడ్డి ప్రకాశ్‌రెడ్డి (37) శనివారం రాత్రి ఉరేసుకుని మృతి చెందాడు. చుట్టుపక్కల వాళ్లు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక ఎస్సై టి.శ్రీరామ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతిడికి ఒక సోదరి ఉండగా, వివాహమై కర్నూలులో ఉంటోంది. తల్లిదండ్రులతో పాటు సోదరుడు కూడా మృతి చెందడంతో ఆమె విషాదంలో మునిగిపోయింది.


మృతి చెందిన ప్రకాశ్‌రెడ్డి (ఫైల్)